# కల నిజమైంది

-వై. కె. మూర్తి

ధనుర్మాసం మంచుతెరలు నింగికి, నేలకు తెల్లని రహదారిని నిర్మిస్తున్నాయి. నాలుగడుగుల దూరంలో ఏమున్నదీ కన్పించనంత దట్టంగా పొగమంచు కమ్మేసింది.

అలవాటుగా తెలతెలవారుతుండగానే లేచింది సీత. కాలకృత్యాలు తీర్చుకొని, వేడివేడి కాఫీ గ్లాసు చేతబట్టుకొని వీధి గుమ్మంవైపు నడిచింది. ఇంటి ముందు చిన్న తోట. కనువిందుగా రంగు రంగుల పూలు. ఇంటి గేటు వరకు రహదారికి అటూ ఇటూ బంతి, చేమంతి పూలు విరబూసి సంక్రాంతి లక్ష్మికి స్వాగతం చెప్తున్నాయి. రాత్రే దిద్దిన రంగవల్లులు రహదారి పొడవునా సప్తవర్ణాలతో అందాలు అందిస్తున్నాయి. మెల్లిగా గేటు వద్దకు నడిచింది.

అల్లంత దూరాన జంగమదేవర బుడబుక్కల శబ్దం చేస్తూ శుభాకాంక్షలు చెప్తూ వస్తున్నాడు. వెంటనే సీత లోపలకు వెళ్ళి భర్త పాంటు, షర్టు తెచ్చి జంగమదేవరకు ఇచ్చింది. మెల్లమెల్లగా బుడబుక్కల శబ్దం దూరమైంది.

వీధి చివరకు దృష్టి సారించింది సీత. అక్కడ పిల్లలు భోగిమంట వేసుకుంటున్నారు. ఆ మంటల తాలూకు ఎర్రని వెలుగులు వారి సంతోషభరితమైన ముఖాలను ప్రకాశింపజేస్తున్నాయి. వాళ్ళు అరచేతులు మంటకు ఎదురుగా పెట్టి, మళ్ళీ ఆ చేతులను ముఖానికి అద్దుకుని వెచ్చదనాన్ని అనుభవిస్తున్నారు. ఆ దృశ్యం సీతను ఎంతగానో ఆకట్టుకొంది. దీక్షగా అటే చూస్తున్న సీత చెవులకు లీలగా హరినామస్మరణ, కీర్తన వినబడింది. సందు మలుపు తిరిగి వస్తున్న హరిదాసు ఆమె దృష్టిపథంలో నిలిచాడు. తలపై అక్షయపాత్ర, నుదుట తిరుచూర్ణముతో దిద్దిన నామాలు, కాషాయ వస్త్రాలు, పూలదండలు, కాళ్ళకు గజ్జెలు– పాడుతున్న హరికీర్తనలకు అనువుగా చేతిలోని చిడతలను, తంబురాను మ్రోగిస్తూ వస్తున్న ఆ హరిదాసు నిజంగా ఆ 'హరి'కి దాసువలెనే వున్నాడు.

మెల్లిగా పొగమంచు విచ్చిపోతోంది. వీధిలో ప్రతి గుమ్మం ముందూ తీర్చిదిద్దిన ముగ్గులు, ఆ ముగ్గులలో పసుపు కుంకుమలతో, పూలతో అలంకరించిన గొబ్బెమ్మలు కళకళలాడుతున్నాయి.

ప్రతి గుమ్మానికీ బంతిపూల తోరణాలు వేళ్ళాడుతున్నాయి. 'అయ్యగారికీ దండం పెట్టు' అంటూ అలంకరించిన గంగిరెద్దులతో మేళగాళ్ళు వస్తున్నారు. సంక్రాంతికి స్వాగతాలు చెప్తున్న ఈ సందడిని చూసి సీత మనసు అనిర్వచనీయమైన అనుభూతితో నిండిపోయింది. ఈ అనుభూతి కోసం తాను ఎన్ని సంవత్సరాలు ఎదురు చూసింది? పుట్టిందీ, పెరిగిందీ పట్నంలోనే అవడంచేత సీతకు కనువిందైన సంక్రాంతి కథల్లోనే కనిపించేది. ఆకాశాన్నంటే అపార్ట్‌మెంట్లతో పట్నంలో ముగ్గులు, గొబ్బెమ్మలు ఏవీ కన్పించేవి కాదు, తెల్లని, రంగుల పెయింట్లతో ముగ్గులు తప్ప ప్రొద్దున్న లేవగానే బ్రతుకు సమరంలో పోటీలూ, పరుగులూ, కారు హారన్లు, సైకిల్ గణగణలు, బస్సుల రొదలూ, ధ్వని కాలుష్యం తప్ప వేరే వీనుల విందైన శబ్దాలుండవు. ప్రశాంతతా ఉండదు. పెళ్ళయ్యాకనైనా మార్పు కోరుకుంది కానీ పట్నంలో వ్యాపారం చేస్తున్న కాంతారావుకు పట్నం వదలడం కుదరలేదు. తర్వాత పిల్లలు, వాళ్ళ భవిష్యత్తు కోసం తాము ఆ ఊరిని వదిలి, తాను కోరుకున్నట్లుగా పల్లెకు రాలేకపోయారు. అక్కడే తన కోరికను మనసులోనే దాచుకుని ఇన్నేళ్ళూ గడిపింది.

చివరికి, ఈనాటికి తన కోర్కె తీరింది. కొడుకు పెద్దవాడై తండ్రి వ్యాపారాన్ని అందిపుచ్చుకున్నాడు. ఇంతవరకూ వ్యాపారంలో పోటీలు, నిరంతర మానసిక ఘర్షణలు ఎదుర్కొని అలసిపోయిన తన భర్త కూడా ప్రశాంత జీవనాన్ని కోరుకొని, ఈ పల్లెల్లో చిన్న ఇల్లు కట్టించారు. చుట్టూ ఆవరణలో పూలచెట్లు వేయించారు. ఈనాటికి తన కల నిజమైంది. అసలైన సంక్రాంతి ఇలాంటి పల్లెలలోనే తప్ప పట్నాలలో ఎక్కడ కనిపిస్తుంది? ఆలోచనలతో మునిగిపోయిన సీతకు, పండుగకి ఇంటికి వచ్చిన కొడుకు, కోడలు, పిల్లలూ నిద్రలేవడం, తమ తమ పనుల్లో మునిగిపోవడం తెలియనేలేదు.

"ఏమిటోయ్! నిల్చునే కలలు కంటున్నావు?" అంటున్న భర్త మాటలు, భుజంపై చిన్నారి మనవడి చేతి స్పర్శ సీతను వాస్తవానికి తెచ్చాయి. తల తిప్పి లోపలికి చూసిన సీతకు పట్టు పరికిణీ కట్టుకుని ముగ్గుల మధ్య నిలబడిన మనవరాలు సంక్రాంతి లక్ష్మిలా కన్పించింది. కోడలు గుమ్మానికి బంతిపూలు కడుతోంది. తోటలో స్తంభానికి వేలాడదీసిన వరికంకులపై వాలిన పిచ్చుకలు గోల చేస్తున్నాయి. అన్నివైపులా సంక్రాంతి శోభ.

"లేదండీ! ఈనాటికి నిజమైన నా కలను చూసుకుంటున్నాను" అంటూ మనవడిని భర్త చేతి నించి అందుకుని లోపలికి నడిచింది. ■